స్వభావం కనక; ఆఖరి రోజునే ఇంచుమించు అందరూ వచ్చేరు. తెల్లారగట్ట లేచి వెళ్లి లైను కట్టిన వాళ్లు కొందరైతే 11 గంటలకి ఆరంభం అని ఆవేళకి చేరి లైన్లో జాయినైన వాళ్లు కొందరు. 2 గంటల వరకు తీసుకుంటారు కదాని రెండున్నర దాటేక చేరిన వాళ్లు మరికొందరు. వెరసి మొత్తం 11 గంటలప్పుడు 950 మందైతే 3 గంటలప్పుడు 1650 అయ్యారు.

"రామ రామ! అక్కడంతా ఆరు బయలు. ఎండకీ వానకీ ఓపెన్. అంచేత "ఎండ" గారు కొంతసేపు మమ్మల్ని ఏడిపిద్దామని చూసి వోడిపోతే అప్పుడు "వాన" గారు దిగబడ్డారు.

"వర్షం అయితే మటుకు? క్యూలోంచి కదిల్తే మోక్షం వుండదు అని ఒకడంటే, - తెచ్చినవే కాగితాలు కదా! తడిసిపోతే ఎలా సమర్పిస్తాం - అని మరొకడు! పోతే పోనీ, ఆరోగ్యం కాపాడుకోవాలి అని ఒకడంటే ఇలాంటి అవకాశం మళ్లీ ఎన్నేళ్లకో; అంచేత పట్టు విడువరాదు - అని వేరొకరు. అలాగ, క్యూలో కొందరు ప్రాణ భయంతో చెల్లాచెదురైనా; క్యూ ప్రాణం మాత్రం నిలబడింది.

"ఇరవై నిమిషాలు కురిసి వర్షమే ఓడిపోయాక అధికార్లు కళ్లు తెరిచారు. నెంబర్లేసి సంతకాలు చేసిన స్లిప్పులు (టోకెన్లు) పంచిపెడుతున్నాం; ఎక్కడి దొంగలు అక్కడనే గప్ చిప్ అని ప్రకటించేరు".

"ఐతే నువ్వు నీ ప్రపోజల్ 3 గంటల్లోగా ఇచ్చేవా?"

"సాయంకాలం 6 వరకు తీసుకున్నారు. అంచేత ఇచ్చేసినట్టే."

"ప్రపోజలు ఎన్ని సెట్లు ఇచ్చావు?"

" ఆ రూల్సు కాగితంలో ఒరిజినల్‌తో పాటు ఏడు కాపీలు అని వుంది. ఒరిజినల్ అనేది కాపీలలో చేరదు కదా అని 8 సెట్లు పట్టుకెళ్లాను. కాని, వాళ్లు "ఏడిస్తే" చాలన్నారు. రసీదులు 3 కాపీలు తయారు చెయ్యమని రూల్సు కాయితంలో వుంది. కాని ఒకటే చాలు అన్నారు. ఏదో చిన్న సాకు పెట్టి ఎంత ప్రతిభనైనా తొలగగొట్టడం అనే మన సంప్రదాయం చాలా తెలివిగా పరిరక్షించబడింది; అక్కడ కూడా."

"అయితే ఇది ఎపిసోడ్ నెంబరు పధ్నాలుగన్న మాట" అని హాస్యం చేస్తే తప్పా ఖుస్రో మామూలు ధోరణికి రాలేదు. ★

# 44. మాటలు జాగర్తగా రానీ!

నేను ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు మా ఫ్రెండు అచ్యుతరామయ్యా, నేనూ ఒక పౌరాణిక నాటకానికి వెళ్లేం.

అసలు ఆ నాటకానికి మేం వెళ్లగలిగి ఉండేవాళ్లం కాదు. దానికి టిక్కెట్లయినా ఉండాలి. లేదా కాంప్లిమెంటరీ పాస్ అయినా ఉండాలి. అయితే, అచ్చుతరామయ్య తండ్రి గారయిన వరహాలు గారు విజయనగరం మహారాజా వారి కోటలో రాణీసాహెబా వారి సిబ్బందిలో ఆదాయ వ్యయాధికారిగా పనిచేస్తూ ఉండేవారు గనక ఆయన పేరిట ఒక 'పాస్' వచ్చింది. సరిగ్గా నాటకం నాడు సాయంకాలం అచ్చుతరామయ్య చిన్నాన్నగారు కలకత్తానించి రావడంతో

ఆయనా, ఆవిడా ఇంటిదగ్గిర ఉండిపోవలసొచ్చినందువల్ల "నువ్వూ నీ ఫ్రెండూ వెళ్లి చూసిండి" అని వరహాలు గారు ఆ పాస్ మా అచ్చుతరామయ్య కిచ్చేరు. మేం చంకలు గుద్దుకొని ఇహ ఆపూట అన్నాలు కూడా సమంగా తినకుండా అడావుడి పడిపోయి నాటకం రాత్రి తొమ్మిదిన్నరకి ప్రారంభిస్తారనగా తొమ్మిది గంటలకే హాలు దగ్గిర రెడీ అయిపోయాం.

మేం అక్కడికి చేరిన సమయానికే కోటలో ప్రెస్సు సూపరింటుగా పనిచేస్తూ వుండిన కొండూరి రామారావు గారు సతీసమేతంగా వచ్చేరు. "ఏంట్రా, నాటకానికా?" అని ఆయన అచ్చుతరామయ్యని పలకరించి, అతని చేతిలో పాస్ చూసి "మిమ్మల్ని ఈ పాస్‌మీద లోపటికి వదల్రు, ఇది మీ నాన్నగారికీ అమ్మగారికీ మాత్రమే వర్తిస్తుంది" అన్నారు రామారావు గారు. అంతలోనే మళ్లీ ఆ కార్డుని నిశితంగా పరిశీలించి "పదండి, నేన్ చెప్తాను" అన్నారు.

గేటు దగ్గిర, (ఇప్పట్లాగా) ఎవరో కేవలం టిక్కెట్టు రంగు చూసి మనుషుల్ని లోపలికి వదిలే రకం, కేజువల్ ఉద్యోగి కాకుండా, స్ఫురద్రూపంతో, విలువైన దుస్తులతో మెరిసిపోతున్న ఒక నిర్వాహక ప్రతినిధి ఉన్నాడు. రామారావు గార్ని చూసి, ఆయన పాస్ అడిగి పుచ్చుకొని, తన దగ్గిరున్న  లిస్టుతో సరిచూసుకొని లోపలికి వెళ్లమని సంజ్ఞ చేసేడు. అచ్చుతరామయ్య తన దగ్గిరున్న పాస్ అందించగానే పాస్ తనే ఉంచేసుకొని; "వెళ్లండి బయటికి! మిస్టర్ అండ్ మిసెస్ కె. వరహాలు గారు అంటే మీరెలా వచ్చేరు? ప్రతివాడికీ..." అని ప్రారంభించి ఆర్గనైజింగ్ రిప్రజెంటేటివ్‌గా తను అనగలిగిన తేలిక మాటలన్నాడు. దాంతో రామారావు గారు కోపంగా, "మిస్టర్! మాటలు జాగ్రత్తగా రానీ!" అని మొదలెట్టి; వరహాలు గారి గొప్పతనాన్ని గురించీ, ఆయన సతీసమేతంగా ఆ నాటకానికి రాలేక పోయినా తనకిచ్చిన పాస్‌ని గౌరవించి పిల్లల్ని పంపడంలో ఉన్న ఔదార్యాన్ని గురించి కఠినంగా చెప్పడం వల్ల మాకు లోపలికి ప్రవేశం దొరికింది.

అంతేకాక; "మాటలు జాగర్తగా రానీ!" అనే ఒక కొత్త ఇడియమ్ కూడా మాకు దొరికింది.

ఆ నాటకంలో ఒక సన్నివేశంలో ఒక పాత్ర మరొక పాత్రతో "నీ వుత్తముండవు" అంటే మా అచ్చుతరామయ్య "మాటలు జాగ్రత్తగా రానీ!.. అని కేకేద్దామా?" అన్నాడు. ఇంకోచోట ఇంకోపాత్ర "నీవు మహా పాతకుండవు" అన్నపుడు కూడా మా అచ్చుతరామయ్య స్పందించాడు. "నువ్వు చాలా ఉత్తముడవు; నువ్వు చాలా పాపాలు చేసిన వాడివి" అంటూ వ్యవహారికంలో డైలాగులు రాసుకుంటే ఇలాంటి ఇబ్బందులు రావు - అని నాకు అచ్చుతరామయ్యే వివరించేడు.

'బాల' అని, మా బావమరిది కూతురు, యూనివర్సిటీలో యేదో పరీక్ష రాయడానికి కిందటి నెలలో ఈ వూరొచ్చి మా ఇంట్లో వుండి ఆ పరీక్ష రాసింది. పరీక్ష జరిగిన మర్నాడే కాకినాడ వెళిపోతానని బ్యాగూ, పోగూ సద్దుకుంది. ముందు గదిలో నేను కూర్చుని ఉంటేనూ, అక్కడికొచ్చి "వెడతాను మామయ్యా" అంది. "వెళ్లొస్తాననాలి" అని నేను ఫార్మల్‌గా చెప్పేసి వూరుకున్నాను గాని మా రెండోవాడు కలగజేసుకొని "బాలా, నువ్వుండవే" అన్నాడు.

అక్కణ్ణించి ఇలా సాగింది, సంభాషణ :-

బాల :- నేనుండను.

మావాడు :- నువ్వుండవే.

బాల :- నేనుండనంటున్నాగా

మావాడు :- నేనూ అదే అంటున్నాను. నువ్వు - ఉండవు.

మావాడి మాటలో ఉన్న విరుపు బాలకి 'వెలగ' లేదు. బాల అనే ఈ మా మేనకోడలు మరీ అంత స్థూలకాయం కాదు కాని, గుండ్రంగా ఉన్నట్టు బంధువుల్లో కొందరు ఆ పిల్లని వేళాకోళం చెయ్యడం ఉంది. లడ్డుండ, రస్కోరావుండ - లాంటి పదాల్లో 'ఉండ' ని అడ్డం పెట్టుకుని మావాడు బాలని టీజ్ చేస్తూ ఉంటే ఆ పిల్ల అదేమీ గ్రహించక తను తొందరగా వాళ్లవూరికి వెళ్లిపోవాలనే ఆందోళనలో "నేను ఉండ ను" అనేస్తోంది. ఈ ప్రతిష్ఠంభన భరించలేక నేను కూర్చున్న దగ్గిర్నుంచి ఏదో పనిలా లేచి బాల పక్కనించి వెళ్తూ దానికి చెవిలో చిన్న ఉండోపదేశం చేసేను. అప్పటికి మా వాడు పదోసారి "నువ్వుండవే" అంటున్నాడు. బాల వెంటనే వాడి దగ్గిరిసా వెళ్లి వాణ్ణి కొట్టినంత పనిచేసి "ఒరే చిట్టీ! మాటలు జాగర్తగా రానీ!" అంది.

మొన్న ఆగస్టు పదిహేను, పదహారు తారీకుల్లో నేను హైదరాబాద్‌లో ఉండడం తటస్థించింది. ఆగస్టు పదహారు పేపర్లన్నిట్లో ఒకవార్త 'పేలింది'. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కుర్చీల యరేంజిమెంట్లు బావులేవని నిరసిస్తూ (నీరసిస్తూ...?) కొందరు పెద్ద మనుషులు ఆ ఉత్సవాల్లో పాలుగొనకుండా (కనీసం టీ, కాఫీ - ఏదీ కూడా కొనకుండా) కట్టుబట్టల్తో కట్టకట్టుకుని వెళ్లిపోయేరు. కుర్చీల యరేంజిమెంటు భౌతికం; స్వాతంత్ర్య దినోత్సవం ఆధ్యాత్మికం; భౌతిక కారణాల వల్ల ఆధ్యాత్మిక అపచారానికి తలపడ్డం "పాత-కంపు-చర్య" అంటూ రాసి పేపర్లన్నీ బోలెడు "నోటి-తడి" పెట్టుకున్నాయి. ఖండించాలంటే కత్తులూ కటార్లు మొదలైనవి మారణాయుధాల మీద నిషేధం అమల్లో ఉంది. అంచేత అనుకుంటాను; పదహారో తేదీని పత్రికా విలేఖరులతో గోష్ఠి ఏర్పాటయింది. గోష్ఠికి హాజరైన ఒక విలేఖరి సాహసించి "నిన్నను మీరు ఎందుకలా వెళ్లిపోయారో చెప్పండి" అని అడిగేడు.

"అది చెప్పాలనే, మిమ్మల్ని పిలిపించాం, మాకు అత్యంత ఆప్తులైన వారొకరు ఆస్పత్రిలో చావు బ్రతుకుల మీద ఉంటేనూ, అది సడెన్‌గా గుర్తొచ్చి లేచి వెళ్లిపోయాం, అంతే."

"అబద్ధాలు చెప్తే నరకం" అన్నాడు విలేఖరి.

"అందుకే చెప్పేశాను."

"అయితే రాసేసుకోమంటారా?"

"అలాగే రాసుకోండి. మీరిచ్చిన హామీయే మాకు శ్రీరామరక్ష"

"నేనేం హామీ ఇవ్వలేదే"!

"ఇప్పుడే కదయ్యా, అబద్ధాలు చెప్తే నరకం అన్నావు! అంటే, నిజం చెప్తే నరుకుతారనే కదా అర్థం?" అన్న ప్రశ్నతో గోష్ఠి ముగిసింది.

నేను విలేఖరితో అన్నాను; "మాటలు జాగర్తగా రానీ!"

★